సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



పర్యాటకానికి ఊతం

నల్లమల ప్రాంతంలో పర్యాటక రంగం అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి.

వివరాలు 8లో ▸



క్రికెట్ టోర్నీ విజేత..

గద్వాలలో హోరాహోరీగా సాగిన క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ విజేతగా నిలిచింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
30.9 /15.7

వాతావరణం

చలి తీవ్రత అధికంగా ఉండడంతోపాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఉచితంగా గ్రహణమొర్రి ఆపరేషన్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో గ్రహణ మొర్రితో బాధపడుతున్న వారికి బసవతారకం స్మైల్ ట్రెన్ సెంటర్‌లో ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని డీఈఓ కార్యాలయ సీఎంఓ బాలుయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ భవిత కేంద్రం వద్ద విద్యార్థులకు ఉచితంగా గ్రహణ మొర్రి చికిత్సలపై బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు ముకుందరెడ్డి, జోషి, స్పీచ్ థెరపిస్టు రవితేజ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కేసులకు భయపడొద్దు



మహబూబ్‌నగర్ న్యూటౌన్: అధికార పార్టీ నాయకులు పెట్టే తప్పుడు కేసులు, బెదిరింపులకు భయపడొద్దని, అందరం కలిసికట్టుగా వాటిని ఎదుర్కొందామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గతంలో తాము ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని, కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో హన్వాడ మండల పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమలు చేయడం సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలిచిందని విమర్శించారు. గ్రామాల్లో ఇప్పటికే కరెంట్ లేదని, రైతుబంధు పడకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టతకు ప్రతిఒక్కరు కృషిచేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ పనితీరు త్వరలోనే ప్రజలకు తెలుస్తుందని చెప్పారు. సమావేశంలో మాజీమంత్రి చంద్రశేఖర్, హన్వాడ ఎంపీపీ బాలరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, వైస్ ఎంపీపీ లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటయ్య, వైస్ చైర్మన్ కృష్ణయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎన్‌ఆర్ క్వింటా రూ.3,432

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.3,432, కనిష్టంగా రూ.2,001 ధర పలికింది. అలాగే హంస రకానికి గరిష్టంగా రూ.2,669, కనిష్టంగా రూ.1,901, చిట్టిముత్యాలు ధాన్యంకు రూ.3,509, మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,311, కనిష్టంగా రూ.2,123, వేరుశనగ గరిష్టంగా రూ.7,790, కనిష్టంగా రూ.4,451, కందులు గరిష్టంగా రూ.8,300, కనిష్టంగా రూ.8,151ధరలు లభించాయి.

వచ్చినవి ఎన్నో.. నమోదు కొన్నే



'ప్రజావాణి' ఫిర్యాదుల ఆన్‌లైన్ ఎంట్రీకి అధికారుల విముఖత

- ఎన్ని దరఖాస్తులు వెల్లడించేందుకు సైతం నిరాకరణ
- పరిష్కారం లభించకపోవడంతో బాధితుల ప్రదక్షిణలు
- పలు శాఖల నుంచి కిందిస్థాయి సిబ్బందే హాజరు
- కొత్త ప్రభుత్వం దృష్టిసారించినా బాధితులకు నిరాశే

రిపేరు కూడా చేయనివ్వడం లేదు

కోయిలకొండ మండలం మల్కాపూర్‌లో ఇళ్లను నిర్మించుకొని 60 సంవత్సరాలైంది. ప్రస్తుతం కొత్త ఇల్లు కట్టుకోవాలన్నా.. రిపేరు చేసుకోవాలన్నా కొందరు వ్యక్తులు ఇబ్బంది పెడుతున్నారు. మోఖాపైకి గిర్దావర్, సర్వేయర్‌లు వచ్చి పంచనామా చేశారు. ఇక్కడ మొత్తం ఇళ్లు ఉన్నట్లు నివేదిక ఇచ్చినా వినడం లేదు. పట్టా మా పేరు మీద ఉందని అంటున్నారు. ఇళ్లకు పన్ను కూడా కడుతున్నాం. ఇళ్లపై పూర్తి హక్కులు కల్పించి మాకు న్యాయం చేయాలని కోరుతూ గ్రామస్తులు సర్పంచ్ నారాయణతో కలిసి వచ్చి ఫిర్యాదు చేశారు.

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో రాష్ట్రస్థాయిలో ప్రగతి భవన్‌లో ప్రజా దర్బార్ నిర్వహణ.. దీంతో జిల్లాస్థాయిలో ప్రజావాణికి ప్రాధాన్యత పెరిగింది. క్షేత్రస్థాయి సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకొని వస్తున్నా మార్పు కనిపించడం లేదు. ఫిర్యాదులకు వాస్తవ పరిష్కారం చూపడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనడానికి ప్రజావాణికి వచ్చిన వినతుల నమోదుతోనే తేటతెల్లమవుతోంది. ప్రజావాణికి పెద్దఎత్తున ప్రజలు వచ్చి సమస్యలపై ఫిర్యాదులు సమర్పించినా.. ఆన్‌లైన్‌లో కొన్నింటిని మాత్రమే నమోదు చేసి మిగతావి అక్కడే ఉన్న అధికారులకు రెఫర్ చేశారు. ఫలితంగా తమ సమస్యలకు పరిష్కారం లభించక వచ్చేవారం తిరిగి ఇచ్చేందుకు మళ్లీ వస్తున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా ఫిర్యాదుదారు ఎన్నిసార్లు ప్రజావాణికి వచ్చారు.. ఎందుకు పరిష్కారం కాలేదనేది స్పష్టత వచ్చే అవకాశముంది.. నమోదు సంఖ్యను తక్కువ చేసేందుకా.. లేక ఫిర్యాదులు పునరావృతమయ్యే విషయం తెలిసిపోతుందనో గాని ఆన్‌లైన్‌లో మాత్రం నమోదు చేయడం లేదు. గత కొన్నిరోజులుగా వచ్చిన ఫిర్యాదుల లెక్క కూడా అధికారులు వెల్లడించకపోవడం గమనార్హం.

కిందిస్థాయి వారే హాజరు..

వారానికోసారి కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి ఆయా ప్రభుత్వ శాఖల నుంచి జిల్లాస్థాయి అధికారులు హాజరు కావాల్సి ఉండగా.. కిందిస్థాయి అధికారులే ఎక్కువగా రావడం గమనార్హం. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఇద్దరు అదనపు కలెక్టర్లు, ఆర్డీఓ, ఇతర అధికారులు ఫిర్యాదులు స్వీకరించినా.. మధ్యాహ్నం కలెక్టర్ రాగానే మళ్లీ తమ ఫిర్యాదులు ఇచ్చేందుకు ప్రజలు క్యూ కట్టడం సమస్యల తీవ్రతకు అద్దం పడుతుందనే చెప్పవచ్చు.

■ ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. ప్రజావాణిలో భాగంగా సోమవారం సమావేశ మందిరంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ధరణి సమస్యలు, మున్సిపల్ పరిధిలో అనుమతులు, ఇతర ధ్రువపత్రాల జారీ, ఉపాధి, ఉద్యోగం వంటి అంశాలపై అధిక ఫిర్యాదులు రాగా.. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మండల స్థాయిలోని ఫిర్యాదుల పరిష్కారానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, ఎంపీడీఓలతో మాట్లాడి పరిష్కారంలో జాప్యం చేయరాదని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, డీఆర్‌ఓ రవికుమార్, డీఆర్‌డీఓ యాదయ్య, ఆర్డీఓ అనిల్‌కుమార్, జెడ్పీసీఈవో జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం..



జడ్చర్ల మండలం పోలేపల్లి పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలి. నామమాత్రపు పనులు చేపట్టి నిధులు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. గ్రామంలో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. దీనిపై ఇప్పటి వరకు నాలుగు సార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామానికి చెందిన కందూరు యాదయ్య ఫిర్యాదు చేశారు.

కోర్టు ఆర్డర్ అమలు చేయాలి



జడ్చర్ల మండలం వల్లూరులో సర్వే నం.118లో 3.19 ఎకరాల భూమికి కోర్టు ఆర్డర్ ఇచ్చినప్పటికీ పట్టా అమలు పర్చకుండా తహసీల్దార్ కార్యాలయ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. మీసేవాలో దరఖాస్తు చేసుకున్నా పట్టా అమలు కాలేదు. కొందరు కబ్జాలో ఉన్నా పట్టించుకోవడం లేదు. కోర్టు ఉత్తర్వులు అమలు చేసి న్యాయం చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన వార్ల నర్సింహులు విన్నవించారు.

భూమికి హక్కు కల్పించండి



రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ గ్రామ శివారులో సర్వే నం.252లో 1.16 ఎకరాల భూమి కేతావత్ కీర్యా పేరుమీద ఉంది. ఈ భూమికి వారసురాలుగా నేను మాత్రమే ఉన్నా. కేతావత్ కీర్యా చనిపోయినా ఇప్పటివరకు నా పేరు మీదకు భూమిని మార్చడం లేదు. కొందరు వ్యక్తులు భూమిపై కన్నేసి కబ్జా చేయాలని చూస్తున్నారు. ఇప్పటికైనా నా భూమిని నా పేరు మీదకు మార్చి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చి ఆదుకోవాలని భోగ్రీబాయి తన కుమారులతో కలిసి ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.

శ్మశాన వాటిక కబ్జా



నవాబ్‌పేట మండలం ఇప్పటూర్‌లో దళితులకు కేటాయించిన శ్మశాన వాటికను కొందరు వ్యక్తులు కబ్జా చేస్తున్నారు. ప్రశ్నిస్తే మాపై దాడులు చేయడమే కాకుండా పట్టా తమ పేరు మీద ఉందని దబాయిస్తున్నారు. శ్మశాన వాటిక స్థలానికి కంచె ఏర్పాటు చేసి కాపాడాలని కోరుతూ గ్రామానికి చెందిన నాయకులు మహేశ్వర్, లక్ష్మయ్య, యాదగిరి, ఆనందం విజ్ఞప్తి చేశారు.

రిజర్వేషన్లలో రోస్టర్ విధానం



గ్రామ పంచాయితీ ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల కేటాయింపులో రోస్టర్ విధానం అమలు చేయాలని కోరుతూ మూసాపేట మండలం వేములకు చెందిన రాజు, లాలు, కొండన్న ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లతో కొన్ని కులాలకు అన్యాయం జరుగుతుందన్నారు. రోస్టర్ పద్ధతిలో రిజర్వేషన్లు కేటాయించిన తర్వాతే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే న్యాయం జరుగుతుంది.

పార్లమెంట్ ఇన్‌చార్జ్‌లుగా.. రేవంత్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు

స్టేషన్ మహబూబ్‌నగర్: వచ్చే లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమవుతోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియామకం చేశారు. ఇందులో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సీఎం రేవంత్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మంత్రి జూపల్లి కృష్ణారావులను ఆ పార్టీ నియమించింది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాలపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిసింది. రెండు పార్లమెంట్ స్థానాలను కై వసం చేసుకునేలా ఇన్‌చార్జ్‌లు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయనున్నారు.

కోయిల్‌సాగర్ నుంచి.. యాసంగికి సాగునీటి విడుదల



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

- కుడి, ఎడమ కాల్వల్లో ఒండ్రుమట్టి, చెట్ల తొలగింపునకు చర్యలు
- కలెక్టర్ రవినాయక్ వెల్లడి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లాలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద ఆయకట్టుకు సాగునీరు విడుదల చేస్తామని కలెక్టర్ రవినాయక్ అన్నారు. యాసంగికి సవరించిన షెడ్యూల్ ప్రకారం సాగునీటిని విడుదల చేసేందుకు, అలాగే ప్రాజెక్టు కింద ఆయకట్టు మొత్తానికి సాగునీరు అందించేందుకు జూరాల నుంచి అదనంగా ఒక టీఎంసీ నీటిని కోయిల్‌సాగర్‌కి ఎత్తిపోసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి ప్రభుత్వ అనుమతి వచ్చిన తర్వాత నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. అంతేకాక ఉపాధి హామీ పథకం కింద ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల్లో ఒండ్రుమట్టి, చెట్ల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా నీటిపారుదల సలహా బోర్డు సమావేశం నిర్వహించారు. ముందుగా ఇరిగేషన్ శాఖ ఇంజినీర్లు ప్రస్తుతం కోయిల్‌సాగర్‌లో ఉన్న నీటి లభ్యత, దాని ద్వారా సాగయ్యే ఆయకట్టు, నీటి విడుదల షెడ్యూల్ తదితర వివరాలను తెలియజేశారు. అనంతరం కలెక్టర్ ప్రజాప్రతినిధులు, రైతుల సలహాలను తీసుకుని మాట్లాడారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల్లో ఒండ్రుమట్టి, చెట్ల తొలగింపు కోసం ఉపాధి హామీ కింద అంచనాలు రూపొందించాలని డీఆర్‌డీఓ యాదయ్యను ఆదేశించారు. అంతకు ముందు జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు లేకుండా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి అదనంగా ఒక టీఎంసీ నీటిని తీసుకునేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదించాలని సూచించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జనవరి మొదటి వారంలో నీటిని విడుదల చేసి ఏప్రిల్ మూడో వారం వరకు నీరిచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు మాజీ చైర్మన్ ఉమామహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాల్వలు ఆధునీకరించినందున క్రాస్ రెగ్యులేటరీలు ఏర్పాటు చేయాలని, కోయిల్‌సాగర్ నుంచి పాలమూరుకు 0.36 టీఎంసీల నీటిని మిషన్ భగీరథ కింద ఇవ్వకుండా శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి ఇచ్చేలా భవిష్యత్‌లో చర్యలు తీసుకోవాలని కోరారు. నీటిపారుదల శాఖ ఎస్‌ఈ చక్రధరం మాట్లాడుతూ నారాయణపూర్ నుంచి ఇన్‌ఫ్లో తగ్గిపోతుందని, కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద సాధ్యమైనంత వరకు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/ మహబూబ్‌నగర్ న్యూటౌన్: మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టిసారించాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మహబూబ్‌నగర్ మున్సిపాలిటీకి సంబంధించి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకుండా చూడాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. గతంలో మున్సిపాలిటీకి మంజూరైన రూ.వంద కోట్ల పనులపై ఆరా తీయగా.. మొత్తం 520 పనులకు గాను ఎనిమిది మాత్రమే పూర్తయ్యాయని ఇంజినీరింగ్ అధికారులు బదులిచ్చారు. 17 పురోగతిలో ఉన్నాయని, 125కు కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్ అయిందని, 356కు వర్క్ ఆర్డర్ ఇచ్చినట్లు వివరించారు. అయితే నిధులు విడుదల కాకపోవడంతో పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. సమావేశంలో కమిషనర్ ప్రదీప్‌కుమార్, ఎంఈ బస్వరాజ్, టీపీఓ లక్ష్మీపతి, డీఈఈ బెంజిమెన్, ఏఈలు పృథ్వీ, సాయిరాం, హరికృష్ణ, వైష్ణవి, ముడా ఏసీపీ ప్రతాప్ పాల్గొన్నారు.

రూ.100 కోట్ల పనులు రద్దు?

ఇదిలా ఉండగా ఏడాదిన్నర క్రితం అప్పటి సీఎం కేసీఆర్ మున్సిపాలిటీకి రూ.వంద కోట్లు మంజూరు చేయగా.. అప్పటి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ 150 పనులకు శంకుస్థాపన చేశారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పనులను రద్దు చేసే యోచనలో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కాంట్రాక్టర్లు సైతం రద్దు చేస్తేనే మేలని భావిస్తున్నారు.

పొరపాట్లకు తావివ్వొద్దు..

ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా టీడీఎస్‌లు సమర్పించాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. హైదరాబాద్ ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో టీడీఎస్‌పై జిల్లా ట్రెజరీ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ–టీడీఎస్‌పై సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఆదాయపన్ను శాఖ అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి వచ్చిన అధికారులు మానస్ రంజన్, బిగోరా, పాంలిహాంగ్, మాధవి, వీరేందర్, రాజా, గీతం వెంకటలక్ష్మి సందేహాలు నివృత్తి చేశారు.

పరవశించిన పాలమూరు

స్టేషన్ మహబూబ్‌నగర్: అయ్యప్పస్వామి నామస్మరణతో పాలమూరు పట్టణం పరవశించిపోయింది. జిల్లాకేంద్రం పాల్కొండ సమీపంలో సోమవారం రాత్రి జ్ఞానజ్యోతి అయ్యప్ప ధర్మ ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జె.మనోహర్ శాస్త్రి ఆధ్వర్యంలో కేరళకు చెందిన శబరిమల మూన్‌మేల్ శాంతి సుధీర్ నంబూద్రి అయ్యప్పపడి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఉదయం 6 గంటలకు గణపతిహోమం, 8 నుంచి 10.30 గంటల వరకు బ్రాహ్మణవాడిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, వేపూరిగేరి ఆంజనేయ స్వామి ఆలయం వరకు అయ్యప్పస్వామి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. కేరళ సంప్రదాయ వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించగా అయ్యప్ప మాలధారులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. సాయంత్రం 5.30 గంటలకు భగవతి సేవ, రాత్రి 7 గంటలకు అయ్యప్ప పూజ, అష్టాభిషేకం, 8 గంటలకు పడిపూజ మహోత్సవం, హరివరాసనం పూజలు జరిపారు. ఈ మహోత్సవంలో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు సీమ నరేందర్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండ వెంకటేశ్, అంజయ్య, ఎదిరె ప్రమోద్‌కుమార్, చింతల నారాయణ, మోనేష్, రామేశ్వర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పడిపూజలో పాల్గొన్న అయ్యప్పస్వాములు



పడిపూజ నిర్వహిస్తున్న సుధీర్ నంబూద్రి

బెల్టు బంద్ అయ్యేనా..?

- ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా దుకాణాల ఏర్పాటు
- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా మూత
- నేటికీ పల్లెల్లో రహస్యంగా మద్యం విక్రయాలు
- మూసివేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్
- చొరవ చూపాల్సిన బాధ్యత ఎక్సైజ్ అధికారులదే..

మహబూబ్‌నగర్ క్రైం: రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో బెల్టు దుకాణాలను మూసివేస్తామని ప్రకటించింది. సీఎం రేవంత్‌రెడ్డి సైతం దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారించి పల్లెల్లో ఉన్న బెల్టు దుకాణాలను మూసివేయించాలని సంబంధిత ఎక్సైజ్ అధికారులకు ఆదేశాలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అయితే ఉమ్మడి జిల్లాలో 230 మద్యం దుకాణాలు, 38 బార్లు ఉండగా.. వీటి ద్వారా ఏటా రూ.2 వేల కోట్లకుపైగా ప్రభుత్వానికి ఆదాయం వస్తోంది. ఈ నెల 1 నుంచి కొత్తగా లైసెన్స్‌లు పొందినవారు దుకాణాలను ప్రారంభించారు. గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉండటం, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులే నిత్యం పార్టీ కార్యకర్తలకు, ఇతరులకు మద్యం పంచడంతో గత రెండు నెలల నుంచి బెల్టు దుకాణాలను ఎక్సైజ్ అధికారులు మూసివేయించారు. అసెంబ్లీ ఫలితాలు వెలువడిన తర్వాత ఉమ్మడి జిల్లాలో కొన్నిచోట్ల బెల్టు దుకాణాలు బహిరంగంగా తెరవకపోయినా రాత్రివేళలో రహస్యంగా విక్రయాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కోడ్ కంటే ముందు ఒక్కో గ్రామంలో తక్కువగా మూడు వరకు బెల్టు దుకాణాలు ఉండేవి.



అధికారుల పాత్ర..

ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం లైసెన్స్ పొందిన దుకాణాల్లోనే మద్యం విక్రయించాలి. అంటే బెల్టు దుకాణాల్లో మద్యం అమ్మడం చట్టరీత్యా నేరం. ఉమ్మడి జిల్లాలో గతంలో ఏకంగా వేల సంఖ్యలో బెల్టు దుకాణాల్లో విక్రయాలు సాగించారు. ఆ స్థాయిలో బెల్టు దుకాణాలు ఉన్నాయంటే సంబంధిత అధికారుల పాత్ర ఎంత ఉంటుందో అర్థమవుతుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఉన్న 230 మద్యం దుకాణాల నుంచి బెల్టు షాపుల యజమానులు మద్యం పరిమాణం, బ్రాండ్‌ను బట్టి రూ.10– 20 వరకు ఎక్కువగా అమ్ముతుండగా.. పల్లెల్లో బెల్టు దుకాణాల నిర్వాహకులు దానిని రూ.70– 100 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో ఒక్కో మద్యం దుకాణానికి వీటి ద్వారా నెలకు రూ.1.50 లక్షల వరకు అదనంగా ఆదాయం వస్తోందని అనధికార అంచనా. ఇలా సుమారు 3 వేలకుపైగా బెల్టు దుకాణాల్లో విక్రయించే మద్యం విలువ నెలకు రూ.350 కోట్లపైమాటే.

■ మరోవైపు దాబాల్లోనూ విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరిగాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దాబాలు మూతపడినా.. కొన్నిచోట్ల రాత్రివేళలో నడుపుతున్నారు. కొత్త ప్రభుత్వ నిర్ణయంతో ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి దాబాలతోపాటు పల్లెల్లో మద్యం పారిస్తున్న బెల్టు దుకాణాలను పూర్తిగా అరికట్టాల్సిన అవసరం ఉంది.

చర్యలు తీసుకుంటాం..

ఉమ్మడి జిల్లాలో ఎక్కడైనా బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు అందితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయడంతోపాటు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాబోయే రోజుల్లో ప్రత్యేకంగా దృష్టిపెడతాం.

– దత్తురాజ్‌గౌడ్,
డీసీ ఎక్సైజ్‌శాఖ, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

ఆత్మకూర్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని తిప్పడంపల్లికి చెందిన కొంతం మద్దిలేటి (55) కుమార్తె ఆరేపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. రోజులాగే సోమవారం మద్దిలేటి తన ద్విచక్ర వాహనంపై కుమార్తెను పాఠశాల వద్ద దిగబెట్టి తిరిగి గ్రామానికి వస్తుండగా గ్రామశివారు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

రాజాపూర్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని ముదిరెడ్డిపల్లి శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ముదిరెడ్డిపల్లి శివారులో రైలు పట్టాల పక్కన ఓ వ్యక్తి మృతదేహం పడి ఉన్న విషయాన్ని స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వయస్సు సుమారు 35 ఏళ్ల ఉండొచ్చని రైల్వే ఎస్‌ఐ అక్బర్ తెలిపారు. మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, మృతుడికి సంబంధించిన వారు తమను సంప్రదించాలని ఆయన కోరారు.

ఉరేసుకుని విద్యార్థిని బలవన్మరణం


అనూష (ఫైల్)

చారకొండ: నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండకు చెందిన విద్యార్థిని రాతు అనూష (23) సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. హైదరాబాద్‌లోని శ్రీఇందు కళాశాలలో అనూష బీఫార్మసీ మూడవ సంవత్సరం చదువుతుంది. ఆదివారం ఆమె సోదరుడితో కలిసి స్వగ్రామానికి వచ్చింది. హాస్టల్‌లో తనను స్నేహితులు ఇబ్బంది పెడుతున్నారని కుటుంబ సభ్యులకు చెప్పగా.. తాము మాట్లాడుతామని ఆమెకు సర్దిచెప్పారు. హాస్టల్ నుంచి వచ్చిన మరుసటి రోజే ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. కాగా విద్యార్థిని ఆత్మహత్య విషయం తెలుసుకున్న వెల్దండ సీఐ సోమనర్సయ్య చారకొండకు చేరుకొని వివరాలు సేకరించారు.

తల్లి మృతిని తట్టుకోలేక మరో బాలిక..

మద్దూరు: తల్లి మృతిని తట్టుకోలేక ఇంటర్ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నారాయణపేట జిల్లా మద్దూరులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్యాంసుందర్ వివరాల మేరకు.. మద్దూరుకు చెందిన గొల్ల రాములు భార్య శ్యామమ్మ రెండు నెలల కిందట అనారోగ్యంతో మృతి చెందింది. నాటి నుంచి పెద్ద కూతురు రాధిక(16) తల్లిపై బెంగ పెట్టుకుని ఎవరితో మాట్లాడకపోవడంతో పాటు కళాశాలకు సైతం వెళ్లడం లేదు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


సాయిలు (ఫైల్)

అడ్డాకుల: మండలంలోని వర్నెకు చెందిన రాగుల సాయిలు(48) జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. కొన్నాళ్ల నుంచి సాయిలు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఆదివారం ఇంటి వద్ద పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని భార్య వెంకటమ్మ సోమవారం ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వెల్టూరులో మహిళ..

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరుకు చెందిన తైలి పద్మమ్మ(45) రెండు రోజుల కిందట ఇంట్లోనే పురుగుల మందు తాగడంతో కుటుంబసభ్యులు గమనించి చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. సోమవారం ఆస్పత్రితో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో తన తల్లి ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి కుమారుడు తైలి శివ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోడేరు: మండల కేంద్రానికి చెందిన పిల్లి నాగరాజు నాగులపల్లి నుంచి కోడేరుకు ఆటోలో సోమవారం రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నాడు. పోలీసుల తనిఖీలో నాలుగు క్వింటాళ్ల 50 కిలోల బియ్యం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రామ్మోహన్‌కు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

పర్యాటకానికి ఊతం


అమరగిరి సమీపంలోని కృష్ణానది తీరం

- నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన జూపల్లి కృష్ణారావు పర్యాటకశాఖ మంత్రి కావడంతో ఆశలు
- పర్యాటకులను ఆకర్షిస్తున్న కృష్ణానది తీరప్రాంతాలు
- గుర్తింపు లేక వెలుగులోకి రాని పలు సుందర ప్రదేశాలు

కొల్లాపూర్: పర్యాటకంగా అభివృద్ధి దశలో ముందుకు సాగుతున్న జిల్లాకు భవిష్యత్‌లో కూడా మంచి రోజులు కొనసాగనున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో పర్యాటక మంత్రిత్వ శాఖను కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావుకు కట్టబెట్టడంతో పర్యాటక అభివృద్ధిపై ఆశలు పెరుగుతున్నాయి. గతంలో ఆయన మంత్రిగా ఉన్న సమయంలోనే కొల్లాపూర్‌లో పర్యాటక అభివృద్ధికి అడుగులు పడ్డాయి. ఇప్పుడు ఆ శాఖ ఆయనకే ఉండడంతో పర్యాటకంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఈసారి మరింత అభివృద్ధి చెందుతుందనే భావనలో ప్రజలు ఉన్నారు.

పలు చారిత్రక ప్రాంతాలు..

నాగర్‌కర్నూల్ జిల్లా సరిహద్దు గుండా నల్లమల అడవులు, కృష్ణానది ప్రవాహం ఉండడంతో ఈ ప్రాంతంలో పర్యాటకులను ఆకర్షించే ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికే సోమశిల, మల్లెలతీర్థం, ఉమా మహేశ్వరం వంటి ప్రాంతాలు పర్యాటకంగా గుర్తింపు పొంది ఆధ్యాత్మికతో పాటు, ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. సోమశిలలోని కృష్ణానది అందాలు తిలకించేందుకు పెద్ద సంఖ్యలో నిత్యం పర్యాటకులు వస్తుంటారు. కొల్లాపూర్‌లోని సురభి రాజుల కోట, జటప్రోల్‌లోని పాత కోట, మదనగోపాలస్వామి దేవాలయం, మూక గుడులు, సింగోటం లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, సమీపంలోని రిజర్వాయర్, కేఎల్‌ఐ, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు, మిషన్‌భగీరథ పంప్‌హౌజ్ వంటి ప్రాంతాలను సందర్శించేందుకు పర్యాటకులు విచ్చేస్తున్నారు. అయితే జిల్లాలో ఇంకా పలు ప్రాంతాలకు పర్యాటక గుర్తింపు లభించాల్సిన అవసరం ఉందని స్థానికులు భావిస్తున్నారు. పర్యాటక ప్రాంతాల్లో వసతి, సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

నిబంధనలు సడలిస్తే..

నల్లమల సమీపంలోని కృష్ణానది తీరప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అటవీ నిబంధనలు, కృష్ణానది యాజమాన్య బోర్డు అనుమతులు అడ్డుపడుతున్నాయి. సోమశిల నుంచి సంగమేశ్వరానికి నిత్యం వందలాది భక్తులు తరలి వెళ్తుంటారు. అయితే ఇక్కడ నది మార్గంలో బోటు ప్రయాణాలకు ఏపీ ప్రభుత్వ అధికారులు అడ్డుపడుతున్నారు. అమరగిరితో పాటు నల్లమల అడవిలోని నది తీర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి అటవీ నిబంధనలు అడ్డుగా ఉంటున్నాయి.

అమరగిరిని అభివృద్ధి చేయాలి



కొల్లాపూర్ నుంచి 9కి.మీ దూరంలో నల్లమల కొండల మధ్యన కృష్ణానది తీరంలో అమరగిరి ఉంది. ఇక్కడి నుంచే చీమలతిప్ప దీవికి, అంకాలమ్మకోటకు జనం వెళుతుంటారు. శ్రీశైలానికి కూడా బోటు ద్వారా వెళ్లవచ్చు. పర్యాటక గుర్తింపు పొందేందుకు మా గ్రామానికి అన్ని అర్హతలు ఉన్నాయి. అమరగిరిని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరుతున్నాం.

– భరత్‌యాదవ్, అమరగిరి

కొల్లాపూర్‌కు ప్రత్యేక గుర్తింపు



కొల్లాపూర్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేందుకు ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కృషి చేస్తారనే నమ్మకం ఉంది. గతంలో ఆయన హయాంలోనే సోమశిల, జటప్రోల్, సింగోటం పర్యాటక ప్రాంతాలుగా గుర్తింపు పొందాయి. తర్వాతి కాలంలో పాలకులు పర్యాటక అభివృద్ధిని పట్టించుకోలేదు. ఇప్పుడు జూపల్లి కృష్ణారావు పర్యాటక శాఖ మంత్రిగా ఉండడంతో మళ్లీ పర్యాటక అభివృద్ధిలో కొల్లాపూర్ పరుగులు పెడుతుందని విశ్వసిస్తున్నాం.

– రహీంపాషా, కౌన్సిలర్, కొల్లాపూర్


గుర్తింపు కోసం ఎదురుచూపులు



కొల్లాపూర్ నియోజకవర్గంలోని నల్లమల కొండల మధ్యన ఉండే అమరగిరి గ్రామాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని గత ప్రభుత్వంలోని పాలకులు హామీ ఇచ్చారు కానీ ఆప్రక్రియ ముందుకు సాగలేదు. అమరగిరి సమీపంలోని చీమలతిప్పదీవిని తిలకించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతారు. మంచాలకట్ట, చెల్లెపాడు వద్ద కృష్ణానది నిండుగా ఉన్నప్పుడు సముద్రపు వాతావరణాన్ని తలపిస్తుంటుంది. నార్లాపూర్ రిజర్వాయర్ ప్రాంతం కూడా పర్యాటకులను కనువిందు చేస్తుంది. వీటితో పాటు పాన్‌గల్ ఖిల్లా, జటప్రోల్ సమీపంలోని కత్వ జలపాతం వంటి మరికొన్ని ప్రాంతాలకు పర్యాటక గుర్తింపు లభిస్తే ఆయా ప్రాంతాల్లో స్థానికులకు జీవనోపాధి మెరుగవడంతో పాటు, అభివృద్ధి పరంగా ముందుకు సాగుతాయి. మల్లేశ్వరం సమీపంలో నేషనల్ హైవే 167కే లో భాగంగా ఐకానిక్ సస్పెన్సివ్ బ్రిడ్జి నిర్మాణం జరగనుంది.

అలర్ట్‌గా ఉండండి

- కరోనా అనుమానిత కేసులకు ఆర్టీపీసీఆర్ టెస్టులు చేయాలి
- కొత్త రకం వైరస్‌పై జాగ్రత్తలు తీసుకోవాలని సూచన



పాలమూరు: దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. ప్రతి జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆర్‌టీపీసీఆర్ కిట్లు అందుబాటులో పెట్టుకుని టెస్టుల సంఖ్య పెంచుతూ లక్షణాలతో వచ్చిన ప్రతిఒక్కరి నుంచి శాంపిల్స్ తీయాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు లేకపోయినా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఆరోగ్యశాఖ అధికారులకు ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కొత్త రకం వైరస్‌లో జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి, తలనొప్పితోపాటు కడుపునొప్పి వంటి లక్షణాలు ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ కొత్త రకం వైరస్ శరీరంలోకి ప్రవేశించిన తర్వాత రోగ నిరోధక శక్తిని తగ్గించడంతో పాటు ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంది. దీనిపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కృష్ణను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టమైన ఆదేశాలు రాలేదని, జిల్లా పరిస్థితి వివరాలు ఇప్పటికే నివేదిక అందించామన్నారు. జిల్లాలో ప్రస్తుతం కరోనా పాజిటివ్ కేసులు లేవని చెప్పారు. జిల్లాలో ప్రజలు మాస్క్ వాడుతూ రద్దీ ప్రాంతాలకు దూరంగా ఉండాలని, జ్వరం, దగ్గు, జలుబు ఇతర లక్షణాలు ఉంటే తప్పకుండా వైద్యుడి సలహాతో చికిత్స తీసుకోవాలని సూచించారు.

చెట్టును ఢీకొన్న ఆటో

- త్రుటిలో తప్పిన ప్రమాదం

లింగాల: మండల కేంద్రం, తెల్కపల్లి రోడ్డు మార్గంలో చెట్టును ఆటో ఢీకొన్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం కోమటికుంటకు చెందిన గుగ్గిళ్ల శేషు లింగాల నుంచి గ్రామానికి ఆటోలో వెళ్తున్నాడు. మార్గమధ్యలో ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి చెట్టును ఢీకొన్నది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటో పాక్షికంగా దెబ్బతిన్నదని తెలిపారు.

వెల్దండలో ఉద్రిక్తత


వెల్దండ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన బీఆర్‌ఎస్ శ్రేణులు
- పోలీస్ వాహనంలో హైదరాబాద్‌కు తరలింపు

వెల్దండ: అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలో పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు ఠాణా ఎదుట ఆందోళన చేపట్టాయి. చివరకు ఆయనను పోలీసు వాహనంలో హైదరాబాద్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన అనంతరం మొదటిసారి మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆయన భార్య అచ్చంపేట నియోజకవర్గం లింగాల మండలం అంబటిపల్లిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు, అచ్చంపేటలో నిర్వహించే బీఆర్‌ఎస్ సమావేశంలో పాల్గొనేందుకు సోమవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో హైదరాబాద్ నుంచి బయలుదేరారు. అచ్చంపేటలో కాంగ్రెస్ ర్యాలీ నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నారని.. మాజీ ఎమ్మెల్యేను అడ్డుకొని దాడిచేసే అవకాశం ఉందని ముందస్తు సమాచారం మేరకు పోలీసులు మార్గమధ్యం వెల్దండలో గువ్వల వాహనాన్ని నిలిపి అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న అచ్చంపేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వెల్దండకు చేరుకొని పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో అచ్చంపేట, కల్వకుర్తి డీఎస్పీల ఆధ్వర్యంలో భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు మూడుగంటల పాటు కొనసాగిన ఆందోళనతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

అధికారం ఉందనే దాడులకు పాల్పడుతున్నారు..

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అచ్చంపేట సభలో ప్రసంగిస్తూ తనను ఓడించి బొందపెట్టాలని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తెలిపారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కావడంతో ప్రస్తుత ఎమ్మెల్యే వంశీకృష్ణ ఉద్దేశ పూర్వకంగా పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. నాగర్‌కర్నూల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న తనపై దాడిచేసి కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసేందుకు కాంగ్రెస్ నాయకులు ఇలాంటి కుట్ర చేశారన్నారు. పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకి ఉందని.. మూడు నెలలు ఓపికగా ఉండి కొత్త ప్రభుత్వానికి సహకరించాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారని తెలిపారు. కానీ అచ్చంపేటలో ఎమ్మెల్యే కావాలని కార్యకర్తలను రెచ్చగొట్టి ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు అధైర్యపడొద్దని.. ప్రజల పక్షాన పోరాడి కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేలా చూడాలన్నారు.


గువ్వల బాలరాజును పోలీస్ వాహనంలో హైదరాబాద్‌కు తరలిస్తున్న పోలీసులు

హైదరాబాద్‌కు తరలింపు..

చివరకు గువ్వల బాలరాజును హైదరాబాద్‌కు వెళ్లాలని పోలీసులు సూచించారు. దీంతో బయటకు వచ్చిన ఆయన అచ్చంపేటకు వెళ్తారన్న అనుమానంతో పోలీసులు తమ వాహనంలో ఎక్కించారు. కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయగా ఎవరూ అధైర్యపడొద్దని.. అధికారంతో అడ్డుకుంటున్నా చివరికి న్యాయం గెలుస్తుందని, పోలీసులకు సహకరించాలని కోరడంతో గొడవ సద్దుమణిగింది. దీంతో అదే వాహనంలో హైదరాబాద్‌లోని ఆయన ఇంటికి తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హాజీపూర్ చౌరస్తాలో హైటెన్షన్..

అచ్చంపేట రూరల్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ సమావేశాలు మండలంలోని హాజీపూర్ చౌరస్తాలో సోమవారం ఒకేరోజు నిర్వహించాలని ముందుగానే నిర్ణయించారు. దీంతో ఇరు పార్టీల శ్రేణులు అక్కడికి పెద్దఎత్తున చేరుకున్నారు. పోలీసులు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును వెల్దండ వద్ద అరెస్టు చేయడంతో రాలేకపోయారు. ఇంటలిజెన్స్ వర్గాల నుంచి పోలీసు ఉన్నతాధికారులకు ముందస్తు సమాచారం ఉండటంతోనే గువ్వల బాలరాజును అరెస్టు చేసి అచ్చంపేట ప్రాంతానికి రాకుండా అడ్డుకున్నారని తెలిసింది. ఏదేమైనా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు వరకు హాజీపూర్ చౌరస్తాలో ఉద్రిక్త వాతావరణం కొనసాగింది. పోలీసు బలగాలు కూడా చౌరస్తాకు చేరుకోవడం, దీనికితోడు కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా చేరుకోవడంతో ఏం జరుగుతోందని కాసేపు ఉద్రిక్తత నెలకొంది. మాజీ ఎమ్మెల్యే గువ్వలను వెల్దండ పోలీస్‌స్టేషన్ వద్ద అరెస్టు చేశారని తెలుసుకొని బీఆర్‌ఎస్ శ్రేణులు అక్కడికి వెళ్లిపోయారు.


హాజీపూర్ చౌరస్తాలో గుమిగూడిన కాంగ్రెస్ శ్రేణులు

అగ్గి తెగులు నివారణకు చర్యలు


అగ్గి తెగులు సోకిన వరి మొక్క

పాడి-పంట
అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: వరి పైరును తీవ్రంగా నష్టపరిచే వాటిలో అగ్గి తెగులు ఒకటి. దీని వ్యాప్తి అరికట్టడానికి తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచించారు. దీని ప్రభావం అన్ని ప్రాంతాల్లో కనిపిస్తుంది. నత్రజని ఎరువులను అధిక మోతాదులో వాడినప్పుడు తెగులు మరింత ఉధృతం అవుతాయని ఏడీఏ వివరించారు.

అగ్గి తెగులు లక్షణాలు

ఈ శిలీంద్రం వరి పంట లేని సమయంలో గట్లపై పెరిగే తుంగ, గరిక, ఊద, గాటేరు గడ్డి జాతి మొక్కలపై జీవిస్తుంది. రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీల సెంటీగ్రేడ్ లేదా అంతకన్న తక్కువగా ఉండి గాలిలో తేమ శాతం 90 అంత కన్న ఎక్కువగా ఉన్నప్పుడు శిలీంద్రం త్వరితంగా పెరిగి బీజాలను ఉధృతి చేసుకుంటుంది. ఈ బీజాలు గాలి ద్వారా పంటకు చేరుతాయి. పంటపై శిలీంద్ర బీజాలు మొలకెత్తడం వల్ల ఆకులపై మచ్చలు ఏర్పడతాయి. మచ్చలు మొదట చిన్నవిగా ఉండి క్రమేణా నూలు కండె ఆకారానికి మారుతాయి. ఈ మచ్చలు అంచులు ముదురు గోధుమ రంగులో ఉండి మధ్య భాగం బూడిదరంగులో కనబడతాయి. తెగులు ఉధృతంగా ఉన్నప్పుడు ఆకులపై మచ్చలు పెద్దవై ఒకదానితో ఒకటి కలిసిపోవడం వలన అవి పాక్షికంగానో లేక పూర్తిగానో ఎండిపోయి మొక్కలు తగలబడినట్లుగా కనపడడం వల్ల ఈ తెగులను అగ్గి తెగులుగా పిలుస్తారు. పైరు పిలకలు వేసే సమయంలో అగ్గి తెగు లు ఆశించినట్లయితే పైరు కురచగా మారి తక్కువ పిలకలు చేస్తోంది. తెగులు కణువులకు సోకినప్పుడు అది గోధుమ లేదా నలుపు రంగుకు మారి ఆ ప్రదేశంలో విరిగిపోతాయి. తెగులు కంకుల మెడ భాగంపై కనబడినప్పుడు నష్టం అధికంగా ఉంటుంది. తెగులు ఆశించిన భాగం ముదురు గోధుమ రంగు లేదా నలుపు రంగుకు మారి కణజాలం కుళ్లడం వలన మెడ వద్ద విరిగి వెన్నులు కిందికి వాలిపోతాయి. దీనినే మెడ విరుపుగా పేర్కొంటున్నారు. ఫలితంగా వెన్ను భాగానికి ఆహార పదార్థాల సరఫరా ఆగిపోయి తాలు గింజలు ఏర్పడతాయి.

తెగులు వ్యాప్తికి అనుకూల పరిస్థితులు

వారం రోజుల పాటు రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీల సెంటిగ్రేడ్‌ల కంటే తక్కువగా ఉండి, గాలిలో తేమ 90 శాతం కంటే ఎక్కువగా ఉన్నప్పుడు, మంచు లేదా వర్షపు జల్లులు పడితే తెగులు వ్యాప్తి చెందుతాయి. నత్రజని ఎరువులు ఎక్కువగా వాడితే తెగులు ఎక్కువగా అభివృద్ధి చెంది పంటకు నష్టం కలుగుతుంది.

యాజమాన్య పద్ధతులు

- అగ్గి తెగులు సోకని పంట నుంచి విత్తనాన్ని సేకరించాలి.
- అగ్గి తెగులును తట్టుకోగల ఎంటీయూ 1010, ఎంటీయూ 1001, ఎంటీయూ 3626, ఐఆర్ 64, ఎస్‌ఎల్ఆర్ 34449, ఎస్‌ఎల్ఆర్ 3041, రాజ వడ్లు వంటి రకాలను ఎంచుకోవాలి.
- విత్తన శుద్ధి తప్పక పాటించాలి. కార్బండిజం మందును కిలో విత్తనానికి 3 గ్రాముల వంతున కలిపి పొడి విత్తన శుద్ధి చేయాలి. లేదా గ్రాము కార్బండిజబ్ మందును లీటరు నీటికి కిలో విత్తనానికి వంతున కలిపి 24 గంటలపాటు నాననిచ్చి తర్వాత మండె కట్టి మొలకెత్తిన విత్తనాలను నారు పోసుకోవాలి.
- పొలం గట్లపై, లోపల ఉన్న ఊద, గరిక, తుంగ, గాటేరు వంటి గడ్డి జాతి మొక్కలను నివారించాలి.
- నత్రజని ఎరువులను అధిక మోతాదులో వాడరాదు.
- నారుమడిలో లేదా పొలంలో అగ్గి తెగులు లక్షణాలు కనిపిస్తే ట్రైసైక్లోజోల్ 75 శాతం 0.6 గ్రాములు లేదా ఐసోప్రోథయోలేన్ 40 శాతం 1.5 ఎంఎల్ లేదా కాసుగా మైసిన్ 3ఎల్ 2.5 ఎంఎల్ మందును లీటరు నీటికి కలిపి పైరు బాగా తడిసేలా పిచికారి చేయాలి. తెగులు వ్యాప్తికి అనుకూల పరిస్థితులు ఉన్నట్లయితే 15 రోజుల వ్యవధిలో రెండో పర్యాయం పిచికారి చేసుకోవాలి. ఈ శిలీంద్ర నాశినీలను ఒకదాని తర్వాత మరొకటి పిచికారి చేసుకోవాలి.

శాఖాపూర్ యూటర్న్ మూసివేత


శాఖాపూర్ వద్ద మూసివేసిన యూటర్న్

అడ్డాకుల: శాఖాపూర్ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న యూటర్న్‌ను రహదారి నిర్వాహకులు సోమవారం మూసి వేశారు. టోల్‌ప్లాజా దాటిన తర్వాత వచ్చే ఈ యూటర్న్ వద్ద ఆటోలు, ద్విచక్రవాహనాలు రాంగ్‌రూట్లో శాఖాపూర్ వరకు వెళ్తున్నాయి. దీనివల్ల కర్నూల్ వైపు వెళ్లే వాహనాలకు ప్రమాదం పొంచి ఉంది. ఈనేపథ్యంలోనే టోల్‌ప్లాజా ఆపరేషన్స్ మేనేజర్ సంతోష్‌కుమార్, రూట్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ రాకేష్‌గౌడ్ తమ సిబ్బందితో వేగ నిరోధకాలను మలుపు వద్ద పెట్టించి దాన్ని మూసి వేశారు. అడ్డాకుల ఎస్‌ఐ మాధవరెడ్డి, స్థానిక సర్పంచ్ జయన్నగౌడ్‌లతో టోల్‌ప్లాజా అధికారులు చర్చించారు. యూటర్న్ మూసి వేసినందున సర్వీస్ రోడ్డుపై వెళ్లి అండర్ బ్రిడ్జిలోంచి వాహనాలు గ్రామానికి వెళ్లాలని తెలిపారు. కాగా గతంలో అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్డుపై ఇటీవల ప్రధాన రోడ్డుపై బీటీ రెన్యువల్ సందర్భంగా తొలగించిన పాత బీటీని వేయించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

డీసెట్ వెబ్ ఆప్షన్లకు అవకాశం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: డీసెట్–2023 రాసి, ధ్రువపత్రాల పరిశీలన చేయించుకున్న విద్యార్థులు ఈ నెల 27లోగా వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపల్ మిరాజుల్లాఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాలకు పరిశీలనకు రాని విద్యార్థులు బుధవారం హాజరుకావాలని కోరారు. పూర్తి సమాచారం కోసం సెల్ నం .99499 93714ను సంప్రదించాలని సూచించారు.

మామిడి చెట్లు ధ్వంసం



కోడేరు: మండలంలోని ఎత్తం శివారులో ఓ రైతు పొలంలో మామిడి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత మహిళా రైతు శంకరమ్మ అనుమానితులపై సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎత్తం చెందిన బోయ శంకరమ్మ తనకున్న వ్యవసాయ పొలంలో 170 మామిడి చెట్లను ఏడాది క్రితం నాటింది. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పొలంలోకి వచ్చి 130 చెట్లను ధ్వంసం చేశారు. దీంతో బాధిత రైతు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

'ఎంఈఓ, ఎస్‌ఐపై కేసు నమోదు చేయాలి'

కొత్తకోట రూరల్: కొత్తకోట ఎంఈఓ కృష్ణయ్య, గతంలో కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వర్తించిన నాగశేఖర్‌రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఉమ్మడి జిల్లా గ్రాడ్యుయేట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భరత్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి, కాంగ్రెస్‌పార్టీ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ ప్రశాంత్ సోమవారం కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణంలో ఓ పాఠశాల, కోచింగ్ సెంటర్, హాస్టల్‌ను ఎలాంటి అనుమతి లేకుండా నిర్వర్తిస్తూ విద్యార్థులను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్వాహకులకు అండగా నిలిచిన ఎంఈఓ, ఎస్‌ఐపై తక్షణమే కేసులు నమోదు చేయాలని లేనిపక్షంలో విద్యార్థి సంఘాలతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

స్టాఫ్ నర్స్ రాత పరీక్ష ఫలితాలు విడుదల

40 వేల మంది మార్కుల జాబితా వెల్లడించిన మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డ్

సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు స్టాఫ్‌నర్స్ రాత పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఏడాది క్రితం నోటిఫికేషన్ ఇవ్వగా, రాత పరీక్ష పూర్తయి కొన్ని నెలలైనా ఇప్పటివరకు ఏదో ఒక కారణంతో ఫలితాలు ఆలస్యమయ్యాయి. మంగళవారం మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ సభ్య కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి ఫలితాలను ప్రకటించారు. 40 వేల మందికిపైగా పరీక్ష రాయగా వారందరి మార్కుల జాబితా విడుదల చేశారు. ప్రత్యేకంగా అర్హత మార్కులు వీటికి లేకపోవడంతో అందరి పేర్లతో జాబితాను విడుదల చేశారు. ఎవరికి వారు అభ్యర్థులు తమకు ఎన్ని మార్కులు వచ్చాయో బోర్డ్ వెబ్‌సైట్లో చూసుకోవచ్చు. అభ్యర్థులు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌ల అనుభవానికి వెయిటేజీ మార్కులుంటే, వాటిని కలిపే జాబితా తయారు చేశారు. ఈ ఫలితాలపై అభ్యర్థులకు ఏమైనా అభ్యంతరాలుంటే బుధవారం సాయంత్రం 5.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల చేస్తారు. ఈ జాబితా ఆధారంగా ఎంపిక చేసిన జోన్‌లోకి వచ్చిన అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం పిలుస్తారు. ఇందులో ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. ఆ తర్వాత ఫైనల్ మెరిట్ లిస్ట్, సెలెక్షన్ లిస్ట్ విడుదల చేస్తారు. అనంతరం జోన్ల వారీగా కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇస్తారు. ఈ ప్రక్రియ వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని బోర్డు వెల్లడించింది. కాగా, తొలుత 5,204 స్టాఫ్ నర్స్ ఖాళీల భర్తీకి గత ఏడాది డిసెంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేయగా, మూడు రోజుల క్రితమే మరో 1,890 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుబంధ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో మొత్తం 7,094 ఖాళీలను (5,204+ 1,890) భర్తీ చేస్తారు. గతేడాది డిసెంబర్ 30న స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నోటిఫికేషన్‌కు అనుగుణంగా 'కంప్యూటర్ ఆధారిత పరీక్ష' ఈ ఏడాది ఆగస్ట్ 2న జరిగింది. అనంతరం ప్రొవిజనల్ కీ విడుదల చేసి దరఖాస్తుదారుల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. సబ్జెక్ట్ నిపుణుల నుంచి వచ్చిన ఇన్‌పుట్‌ల ఆధారంగా 'కీ కమిటీ' తుది కీని ఖరారు చేసింది. ప్రిలిమినరీ కీకి, ఫైనల్ కీకి మధ్య ఎలాంటి తేడా లేదు. దీంతో ప్రిలిమినరీ కీని తుది కీగా పరిగణించారు.

'గృహలక్ష్మి' దరఖాస్తులు పరిశీలించొద్దు!

ప్రభుత్వం కీలక నిర్ణయం?

- గత ప్రభుత్వం చివరలో 15 లక్షల దరఖాస్తుల సేకరణ
- కానీ వాటి స్థానంలో కొత్తగా మళ్లీ దరఖాస్తులు సేకరించాలని ప్రభుత్వ నిర్ణయం
- గ్రామసభల ద్వారా జనం నుంచి దరఖాస్తులు సేకరించేలా ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వం చివరలో ప్రారంభించిన గృహలక్ష్మి పథకం కోసం సేకరించిన 15 లక్షల దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోకూడదని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. వాటిని పూర్తిగా పక్కన పెట్టి కొత్తగా దరఖాస్తులు తీసుకోవాలని భావిస్తోంది.

మంజూరు చేసే వేళ ముంచుకొచ్చిన ఎన్నికలు

గత ప్రభుత్వం తొలుత డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. భారీ యూనిట్ కాస్ట్‌తో, దేశంలో ఎక్కడా లేనట్టుగా ఉచితంగా రెండు పడక గదులతో కూడిన ఇళ్లను నిర్మించాలని నిర్ణయించింది. కానీ వాటి యూనిట్ కాస్ట్ సరిపోవటం లేదంటూ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవటం, సాంకేతికంగా కొన్ని లోపాలు చూపి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం నిధులు నిలిపేయటం, కొన్ని అంతర్గత లోపాలు.. వెరసి ఆ పథకం అంత వేగంగా ముందుకు సాగలేదు. దీంతో ఏడాది క్రితం.. దాని స్థానంలో గృహలక్ష్మి పథకాన్ని ప్రారంభించింది. సొంత జాగా ఉండి ఇల్లు లేని పేదలకు రూ.3 లక్షలను అందించి వారే ఇళ్లను నిర్మించుకునేలా దీన్ని రూపొందించారు. ఇంచుమించు ఇందిరమ్మ పథకం తరహాలోనే డిజైన్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుని దరఖాస్తులు ఆహ్వానించింది. 15 లక్షల దరఖాస్తులు వచ్చి పడ్డాయి. వాటిల్లో 12 లక్షలు అర్హమైనవిగా గుర్తించారు. వాటిల్లో నుంచి 4 లక్షల దరఖాస్తులు ఎంపిక చేసే వేళ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. చివరి తేదీ రాత్రి వరకు దాదాపు2 లక్షల దరఖాస్తులకు సంబంధించి జాబితాను సిద్ధం చేశారు. వారికి నిధులు ఇచ్చేందుకు వీలుగా ఎన్నికల సంఘం నుంచి అనుమతి కూడా వచ్చింది. కానీ,



అప్పటికే ప్రచారం తారస్థాయికి చేరుకోవటంతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తమ దరఖాస్తులను రిజెక్టు చేస్తుందేమోనన్న భయంతో కొందరు దరఖాస్తుదారులు కూడా అధికారులపై ఒత్తిడి చేయకుండా ఎన్నికలయ్యే వరకు వేచిచూసే ధోరణి అవలంబించాలని నిర్ణయించారు. వారు అనుకున్నట్టే ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో ఇందిరమ్మ ఇళ్ల కోసం తమ దరఖాస్తులను పరిశీలిస్తుందని వారు ఆశతో ఎదురుచూస్తున్నారు. కానీ, వారి ఆశలపై నీళ్లు చల్లుతూ ఆ దరఖాస్తులను పరిశీలించవద్దని ప్రభుత్వం నిర్ణయించింది.

గ్రామ సభల్లో కొత్త దరఖాస్తులు..

గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా ఇందిరమ్మ ఇళ్ల కోసం గ్రామ సభల్లో దరఖాస్తులు స్వీకరించేవారు. ఇప్పుడు కూడా అదే పద్ధతిని అవలంబించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పాత ప్రభుత్వం సేకరించిన దరఖాస్తులను పక్కన పెట్టి కొత్తగా దరఖాస్తులు స్వీకరించనున్నారు. న్యాయపరమైన చిక్కులను అధిగమించేందుకు కూడా ప్రభుత్వం ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు తెలిసింది. ఇటీవల హైకోర్టులో గిరిజనప్రాంతాల్లో దరఖాస్తుల స్వీకరణ అంశంపై ఓ కేసు విచారణకు వచ్చింది. నిబంధనల ప్రకారం గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల ద్వారా జరగాల్సి ఉంటుంది. గిరిజనులకు దక్కాల్సిన లబ్ధి గిరిజనేతరులు తన్నుకుపోతున్నారన్న ఉద్దేశంతో వారికి రక్షణగా ఈ నిబంధన ఏర్పాటు చేశారు. గృహలక్ష్మి పథకంలో దరఖాస్తుల స్వీకరణలో ఈ నిబంధనల పాటించలేదన్నదని ఫిర్యాదు. నిబంధనలకు విరుద్ధంగా దరఖాస్తుల స్వీకరణ జరిగిందన్న వాదనను ఇప్పుడు ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్టు సమాచారం. సరిగ్గా ఎన్నికల వేళ దరఖాస్తుల పరిశీలన జరిగిన నేపథ్యంలో మొత్తంగా ఆ దరఖాస్తులను పక్కనపెట్టనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

పేదలకు ఆరోగ్యమస్తు

- ఆరోగ్యశ్రీ చికిత్స పరిమితి రూ.25 లక్షలకు పెంపు: ఏపీ సీఎం జగన్
- విస్తరించిన ప్రయోజనాలతో ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల పంపిణీ

సాక్షి, అమరావతి: వైద్యం కోసం పేదలు ఏ ఒక్కరూ అప్పుల పాలు కాకూడదనే తాపత్రయంతో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రజలకు మరింత చేరువ చేశామని, ఇది ప్రాణం విలువ తెలిసిన ప్రభుత్వమని, గతంలో ఎన్నడూ చూడని విధంగా ప్రభుత్వ వైద్య రంగం స్వరూపాన్ని మార్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స వ్యయం పరిమితిని ఏకంగా రూ.25 లక్షలకు పెంచుతూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులంటే సిబ్బంది ఉండరనే దుస్థితిని మన ప్రభుత్వం పూర్తిగా మార్చేసిందన్నారు. ఒక్క వైద్య ఆరోగ్య శాఖలోనే 53,126 మంది డాక్టర్లు, నర్సులు, పారామెడిక్స్ లాంటి వైద్య సిబ్బందిని నియమించి మానవ వనరుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. జాతీయ స్థాయిలో ప్రభుత్వాసుపత్రుల్లో స్పెషలిస్టు డాక్టర్ల కొరత 61 శాతం ఉంటే మన రాష్ట్రంలో కేవలం 3.96 శాతం మాత్రమే ఉందని, ఈ కొరతను కూడా అధిగమించేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఇక జాతీయ స్థాయిలో నర్సుల కొరత 27 శాతం అయితే మన రాష్ట్రంలో సున్నా అని


స్మార్ట్ కార్డులను అందుకున్న లబ్ధిదారులతో సీఎం

తెలిపారు. జాతీయ స్థాయిలో ల్యాబ్ టెక్నీషియన్ల కొరత 33 శాతం అయితే మన రాష్ట్రంలో సున్నా స్థాయికి తెచ్చామని, నూటికి నూరు శాతం పోస్టులను భర్తీ చేశామని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు పొందడానికి ఏం చేయాలి? ఎవరిని అడగాలి? ఎక్కడికి వెళ్లాలి? చికిత్స వ్యయం ఎంతవరకు వర్తిస్తుంది? తదితర సందేహాలను సంపూర్ణంగా నివృత్తి చేస్తూ సరికొత్త ఫీచర్లతో రూపొందించిన ఆరోగ్యశ్రీ కొత్త కార్డులను లబ్ధిదారులకు అందజేసి విస్తృత అవగాహన కల్పించాలని అధికార యంత్రాంగాన్ని సీఎం జగన్ ఆదేశించారు. ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంపు, స్మార్ట్ కార్డుల పంపిణీ, లబ్ధిదారులకు దిక్సూచిలా పనిచేసే ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ కార్యక్రమాలను సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ లాంఛనంగా ప్రారంభించారు.



ఎరుపెక్కిన జగిత్యాల

భూమి కోసం భారీగా తరలివచ్చిన మహిళలు

జగిత్యాల: జగిత్యాల జిల్లా కేంద్రం సోమవారం మహిళలతో కిక్కిరిసింది. జిల్లా కేంద్రం శివారు నర్సింగాపూర్, టీఆర్‌నగర్‌లోని ప్రభుత్వ భూముల్లో పేదలకు పట్టాలు ఇప్పిస్తామని కొంతకాలంగా సీపీఎం నాయకులు ప్రచారం చేశారు. వివిధ జిల్లాల నుంచి మహిళలను తీసుకొచ్చి భూపోరాటం పేరిట గుడిసెలు వేయించారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని, జగిత్యాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని ఆ పార్టీ నాయకులు సూచించడంతో జిల్లాతోపాటు, పొరుగుజిల్లాల నుంచి మహిళలు భారీగా తరలివచ్చారు. చంటిపిల్లలతో తల్లులు, గర్భిణులు, వృద్ధులు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. దీంతో జగిత్యాల మొత్తం ఎరుపుమయంగా మారింది. వచ్చిన వారిలో కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, వరంగల్, సిద్దిపేట తదితర జిల్లాల వారు కూడా ఉండటం గమనార్హం. దీనిపై మహిళలను ఆరా తీయగా, సీపీఎం నాయకుల ప్రచారం మేరకు జగిత్యాలకు వచ్చామని, దరఖాస్తు చేసుకుంటే కొందరు నాయకులు రూ.200 తీసుకున్నారని, అలాగే నర్సింగాపూర్, టీఆర్‌నగర్‌లో నివాసమున్నవారు రూ.5 వేలు చెల్లించాలని నిబంధన పెట్టారని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కావడంతో మహిళలు పెద్దఎత్తున తరలివచ్చినట్లు తెల్సింది. అయితే ఇళ్లు ఇప్పిస్తామంటూ నేతలు మహిళలకు హామీ ఇచ్చి పంపించినట్లు తెలిసింది.

సీబీఐ ఎస్పీ, వైఎస్ వివేకా కుమార్తె, అల్లుడిపై కేసు నమోదు

- అప్పట్లో పులివెందుల కోర్టులో ప్రైవేట్ కంప్లయింట్ చేసిన వివేకా పీఏ కృష్ణారెడ్డి
- కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఎస్పీ రాంసింగ్, వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డిలపై కేసు నమోదు

పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసుకు సంబంధించి పులివెందుల కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఎస్పీ రాంసింగ్, వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డిలపై వైఎస్సార్ జిల్లా పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. వివేకా హత్యకేసుకు సంబంధించి సీబీఐ దర్యాప్తు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై అప్పట్లో సీబీఐ అదనపు ఎస్పీ రాంసింగ్ (తరువాత ఎస్పీ అయ్యారు) నేతృత్వంలో దర్యాప్తు కొనసాగిన విషయం విదితమే. రాంసింగ్ ఏకపక్షంగా, కేవలం కేసుతో సంబంధం లేని వ్యక్తులను టార్గెట్ చేసి దర్యాప్తు చేశారని విమర్శలు ఎదుర్కొన్నారు. అందులో భాగంగా అప్పట్లో వైఎస్ వివేకా పీఏ కృష్ణారెడ్డిని కూడా రాంసింగ్, వైఎస్ వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి పలుమార్లు తమకు అనుకూలంగా వ్యవహరించాలని బెదిరించారు. హత్యకేసు దర్యాప్తులో భాగంగా పీఏ కృష్ణారెడ్డిని పలుమార్లు రాంసింగ్ విచారణకు పిలిపించుకుని కేసులో తాము చెప్పినట్లు వినాలని, తాము చెప్పినట్లుగా కోర్టులో మేజిస్ట్రేట్ ముందర సెక్షన్ 164 కింద వాంగ్మూలం ఇవ్వాలని, కేసుతో సంబంధం కొంతమంది వ్యక్తుల పేర్లు చెప్పాలని బెదిరించారు. దీనికి అంగీకరించని కృష్ణారెడ్డిపై ఆయన కుటుంబసభ్యుల ముందే పలుమార్లు రాంసింగ్ థర్డ్ డిగ్రీ ఉపయోగించి దారుణంగా కొట్టారు. అలాగే వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి కూడా కృష్ణారెడ్డిని తమ వద్దకు పిలిపించుకుని సీబీఐ వారు చెప్పినట్లుగా వినాలని, లేకపోతే ఈ కేసులో ఇరికిస్తారని, సీబీఐ వాళ్లు చెప్పినట్లుగా వినడం వల్లనే వాచ్‌మన్ రంగన్న, డ్రైవర్ దస్తగిరిలను కేసు నుంచి కాపాడటం జరిగిందని పలుమార్లు బెదిరించారు. దీనిపై అప్పట్లో సాక్ష్యం చెప్పడానికి అంగీకరించని పీఏ కృష్ణారెడ్డి 2021 డిసెంబర్ 28వ తేదీన పులివెందుల కోర్టుకు వెళ్లి ప్రైవేట్ కంప్లయింట్ చేశారు. దీన్ని పరిశీలించిన పులివెందుల కోర్టు రాంసింగ్, సునీత, రాజశేఖరరెడ్డిలపై కేసు నమోదు చేసి విచారించాలని ఆదేశాలు జారీచేసింది. దీంతో ఆ ముగ్గురిపై పులివెందుల పోలీసులు ఐపీసీ సెక్షన్లు 352, 323, 330, 342, 348, 506, 194/ఏ, 166ఏ(బి), 109 కింద కేసు నమోదు చేశారు. దీనిపై సోమవారం వైఎస్సార్‌సీపీ లీగల్ అడ్వయిజర్ ఓబుళరెడ్డి పులివెందులలో మీడియాతో మాట్లాడుతూ పులివెందుల కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని, విచారణలో మిగిలిన విషయాలు తెలుస్తాయని చెప్పారు.

సమస్యలు పరిష్కరించండి

సాక్షి, హైదరాబాద్: కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు వై.గోపీరెడ్డి నేతృత్వంలో ప్రతినిధి బృందం సోమవారం డీజీపీ రవి గుప్తాను కలిసి వినతిపత్రం అందించారు.

పోల్కంపల్లి గుట్టల్లో హైనా సంచారం



అద్దాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి సమీపంలోని గుట్టల్లో హైనా సంచారం కలకలం రేపుతుంది. కొన్నాళ్ల నుంచి గుట్టలో చిరుత పులి సంచరిస్తోందని గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఆదివారం గుట్ట సమీపంలోని పొలాల్లో చిరుత కనిపించిందని స్థానికులు తెలిపారు. గ్రామస్తుల సమాచారంతో సోమవారం మూసాపేట ఎస్ఐ శ్రీనివాసులు దీనిపై అటవీశాఖ అధికారులకు సమాచారం చేరవేశారు. అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, బీట్ ఆఫీసర్ శశికళ గుట్ట పరిసరాల్లోని పొలాల్లో పరిశీలించారు. అడుగు జాడల ఆధారంగా చిరుత పులి కాదని హైనాగా గుర్తించినట్లు బీట్ ఆఫీసర్ శశికళ తెలిపారు. గుట్ట పరిసరాల్లోని పొలాల్లో మేకలు, చిన్న చిన్న దూడలను కట్టేయవద్దని రైతులకు సూచించారు. ఇదిలా ఉండగా చక్రాపూర్, తుంకినీపూర్, వేముల సమీపంలోని గుట్టల్లో కొన్నాళ్ల క్రితం చిరుత సంచారంతో రైతులు, గొర్రెల కాపరులు ఆందోళనకు గురవగా తాజాగా పోల్కంపల్లి వద్ద హైనా సంచారం ఆందోళన రేకెత్తిస్తోంది.

క్రికెట్ టోర్నీ విజేత హైదరాబాద్


మొదటి బహుమతి అందుకుంటున్న హైదరాబాద్ జట్టు


ద్వితీయ బహుమతి అందుకుంటున్న మహబూబ్‌నగర్ జట్టు

- రన్నర్‌గా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టు

గద్వాల: జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ 67వ రాష్ట్ర స్థాయి అండర్-19 క్రికెట్ టోర్నీ సోమవారం ముగిసింది. హోరాహోరీగా సాగిన టోర్నీలో హైదరాబాద్ జట్టు విజేతగా, మహబూబ్‌నగర్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. వరంగల్ జట్టు మూడవ స్థానంలో నిలిచింది. సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. మహబూబ్‌నగర్ – వరంగల్ జట్ల మధ్య జరిగిన మొదటి సెమీఫైనల్ మ్యాచ్, హైదరాబాద్ – మెదక్ జట్ల మధ్య జరిగిన రెండో సెమీఫైనల్ మ్యాచ్ నువ్వా.. నేనా అన్నట్లుగా సాగాయి. చివరకు వరంగల్‌పై మహబూబ్‌నగర్ జట్టు, మెదక్‌పై హైదరాబాద్ జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరాయి. మహబూబ్‌నగర్ – హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ రసవత్తరంగా సాగింది. ఇరు జట్ల క్రీడాకారులు ఓవైపు క్రీడాస్ఫూర్తిని కనబరుస్తూనే.. మరోవైపు గెలుపునకు చివరిదాకా కృషి చేశారు. మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో నాలుగు వికెట్లను కోల్పోయి 119 పరుగులు చేసింది. విజయలక్ష్యంతో బరిలో దిగిన మహబూబ్‌నగర్ జట్టు చివరలో చతికిలపడింది. 6 వికెట్లను కోల్పోయి వంద పరుగులు చేసింది. 19 పరుగుల తేడాతో హైదరాబాద్ జట్టు విజేతగా, రన్నర్‌గా మహబూబ్‌నగర్ జట్టు నిలిచాయి. మూడో స్థానం కోసం వరంగల్ – మెదక్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వరంగల్ జట్టు విజయం సాధించింది.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి..

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి బీఎస్ ఆనంద్ పిలుపునిచ్చారు. స్థానిక స్టేడియంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడా పోటీలు విద్యార్థుల్లో పట్టుదలను పెంచుతాయన్నారు. క్రీడల్లో రాణిస్తున్న వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. పోటీల రాష్ట్ర పరిశీలకుడు రాంగోపాల్ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతకు క్రీడలు శారీరక, మానసిక ఆనందం, ఆరోగ్యాన్ని కలిగిస్తాయన్నారు. అనంతరం విజేతలకు మెమెంటోలు, మెడల్స్‌ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాపిరెడ్డి, జిల్లా కార్యదర్శి జితేందర్, పీఈటీలు రాము, కృష్ణయ్య, బీసన్న, నర్సింహరాజు, క్రికెట్ కోచ్ శ్రీనివాసులు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి పోటీలు


హాకీ టోర్నీలో తలపడుతున్న బాలికలు

వనపర్తిటౌన్: వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల హాకీ, అండర్-14 బాలికల ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండోరోజు సోమవారం హాకీ బాలుర విభాగంలో మహబూబ్‌నగర్, నిజామాబాద్ జట్లు తలపడగా, మహబూబ్‌నగర్ 2-1 స్కోర్‌తో పైచేయి సాధించింది. కరీంనగర్, రంగారెడ్డి, నల్గొండ, నిజామాబాద్ మధ్య వేర్వేరుగా సాగిన మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. వరంగల్, ఖమ్మం జట్ల మధ్య జరిగిన పోరులో 5-0 స్కోర్‌తో వరంగల్ దూకుడు ప్రదర్శించింది. మెదక్, ఆదిలాబాద్ జట్లు తలపడగా.. ఆదిలాబాద్ 8-0 స్కోర్‌తో గెలుపొందింది. నిజామాబాద్, ఖమ్మం జట్ల మధ్య జరిగిన పోటీలో 9-0 స్కోర్‌తో నిజామాబాద్ గెలిచింది. వరంగల్, నల్గొండ జట్లు పోటీపడగా 1-0 స్కోర్‌తో వరంగల్ విజయం సాధించింది. మహబూబ్‌నగర్, వరంగల్ మధ్య జరిగిన పోటీలో 2-0తో మహబూబ్‌నగర్ గెలుపొందింది. ఆదిలాబాద్, రంగారెడ్డి జట్ల మధ్య పోటీలో 6-1 ఆదిలాబాద్‌కు విజయం వరించింది. హైదరాబాద్, మెదక్ జట్లు పోటీకి దిగగా.. 2-1 స్కోర్‌తో హైదరాబాద్ గెలుపొందింది. ఆదిలాబాద్, కరీంనగర్ జట్ల మధ్య జరిగిన పోరులో ఆదిలాబాద్ 1-0 స్కోర్‌తో విజయం సాధించింది. హైదరాబాద్, రంగారెడ్డి జట్లు పోటీపడగా 1-1తో డ్రాగా ముగిసింగి. మహబూబ్‌నగర్, నల్గొండ జట్ల మధ్య జరిగిన పోటీలో 2-1తో నల్గొండ జట్టు గెలుపొందింది.

బాలికల విభాగంలో..

మహబూబ్‌నగర్, నల్గొండ జట్ల మధ్య జరిగిన పోరులో 2-0 స్కోర్‌తో మహబూబ్‌నగర్ విజయం సాధించింది. అనంతరం వరంగల్, ఖమ్మం జట్లు బరిలోకి దిగగా.. ఖమ్మం 2-0 స్కోర్‌తో గెలుపొందింది. కరీంనగర్, రంగారెడ్డి జట్ల మధ్య జరిగిన పోటీలో 1-0 స్కోర్‌తో కరీంనగర్‌కు విజయం వరించింది. నిజామాబాద్, వరంగల్ జట్లు తలపడగా.. 6-1తో నిజామాబాద్ గెలుపొందింది. నల్గొండ, హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన పోరులో 2-0 స్కోర్‌తో నల్గొండ విజయం సాధించింది. ఆదిలాబాద్, ఖమ్మం జట్ల మధ్య సాగిన పోరులో 7-0 స్కోర్‌తో ఖమ్మం విజయం దక్కించుకుంది. మహబూబ్‌నగర్, రంగారెడ్డి పోటీపడగా 2-0 స్కోర్‌తో మహబూబ్‌నగర్‌లో గెలుపొందింది. నిజామాబాద్, ఆదిలాబాద్ మధ్య సాగిన పోరులో 5-0 స్కోర్‌తో నిజామాబాద్ విజయం సాధించింది. హైదరాబాద్, రంగారెడ్డి మ్యాచ్ డ్రాగా ముగిసింది. వరంగల్, మెదక్ జట్ల మధ్య జరిగిన పోటీలో 2-0 స్కోర్‌తో వరంగల్ గెలుపొందింది. ఆదిలాబాద్, మెదక్ జట్ల మధ్య సాగిన పోరులో 2-0 స్కోర్‌తో మెదక్‌కు విజయం వరించింది. నిజామాబాద్, ఖమ్మం జట్ల మధ్య పోటీలో 3-0 స్కోర్‌తో నిజామాబాద్ గెలుపొందింది. మహబూబ్‌నగర్, కరీంనగర్ మధ్య సాగిన పోరులో 1-0 స్కోర్‌తో మహబూబ్‌నగర్ విజయం సాధించింది.

సామాజిక సేవలో ముందుండాలి



సదస్సులో మాట్లాడుతున్న వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్

- పాలమూరు వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్

కొల్లాపూర్: సామాజిక చేయూత అందించడంలో ఉన్నత విద్యావంతులు ముందుండాలని పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్ కోరారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో ఎంఎస్‌డబ్ల్యూ శాఖ ఆధ్వర్యంలో 'విపత్తు నిర్వహణలో మానసిక, సామాజిక చేయూతనివ్వడంలో సంఘ సేవకుని పాత్ర' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ యువత మేధస్సును వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఇలాంటి సదస్సులు దోహదపడతాయన్నారు. సదస్సులో పాల్గొనడంతో చదువులో ప్రతిభ కనబర్చే అవకాశం ఉంటుందని తెలిపారు. సోషల్ వర్క్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు సామాజిక సేవా దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నాయని.. ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని మెరుగైన ఫలితాలు సాధించాలని కాంక్షించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డా. మార్కిపోలోనియస్, సదస్సు కన్వీనర్ దేవరాజ్, అధ్యాపకులు పాల్గొని ప్రసంగించారు.

బాస్కెట్‌బాల్, కబడ్డీ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అండర్- 17 విభాగం బాస్కెట్‌బాల్ ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బాల, బాలికలు హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సహాయ కార్యదర్శి వేణుగోపాల్, పెటా టీఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, పీడీ సూర్యప్రకాశ్, పీఈటీలు విలియం, శారదాబాయి, బాలరాజు, ఫారుక్ ముకర్రం, మేరిపుష్ప, శైలజ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎస్‌జీఎఫ్ అండర్-17 విభాగం జిల్లాస్థాయి కబడ్డీ ఎంపికలు


జిల్లా ఎస్‌జీఎఫ్ కబడ్డీ జట్టు

నిర్వహించారు. ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ జట్టు

విద్యారంగానికి ప్రాధాన్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: విద్యారంగానికి కొత్త ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుభాష్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో జిల్లా సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరికీ ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలన్నారు. బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ చార్జీలు సకాలంలో ఇవ్వకపోతే పోరాటం చేస్తామన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం అనేక మంది ప్రాణత్యాగం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకుంటే బీఆర్ఎస్ ప్రభుత్వంతో ఏవీ నెరవేరలేదన్నారు. దీంతో ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో ప్రజలు సరైన తీర్పునిచ్చారన్నారు. ముఖ్యంగా విద్యార్థులు మత్తు పానియాలు తీసుకోవద్దని, ఉన్నత సమాజం కోసం ఆలోచన చేయాలన్నారు. భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ లాంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాం, మధు, కోశాధికారి శివకుమార్, రామచందర్, మధుసూదన్, సాయికిరణ్, శ్రీలత, స్వప్న, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.